# అపోలో హాస్పిటల్స్

## కొవిడ్-19 కరోనా వైరస్

## #BREAKCORONA

# కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు మీరు తెలుసుకోవాల్సినవి

**కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం తప్పనిసరా?**

కోవిడ్ 19 వ్యాక్సిన్ తీసుకోవడమనేది పూర్తిగా స్వచ్ఛందం మరియు తప్పనిసరి కాదు. అయితే, ఇన్ఫెక్షన్ గొలుసును తెంచడంలో దీని కీలక పాత్ర కారణంగా, గట్టిగా సిఫార్సు చేయడమైనది. వ్యాక్సిన్ తీసుకోవడం మీ సొంత ఆరోగ్యానికే కాకుండా మీరు ప్రేమించే మీ కుటుంబం, స్నేహితులు, బంధువులు, సహోద్యోగులు, మరియు మీతో భౌతికంగా దగ్గరగా ఉండే వారి ఆరోగ్యం కోసం పూర్తి ఆవశ్యకం.

అలాగే, కోవిడ్ నుండి కోలుకున్న వ్యక్తి సైతం కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవాలా, వద్దా అనే అయోమయానికి గురికావొద్దు. గతంలో ఇన్ఫెక్షన్ సోకి, దాని నుండి కోలుకున్నవారైనా సరే, వ్యాక్సిన్ తీసుకోవాలని గట్టిగా సిఫార్సు చేయడమైనది.

**నేను ఏదైనా వైద్య ప్రక్రియలో ఉన్నప్పుడు కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకుంటే, అది నా శరీరం మీద ప్రభావం చూపుతుందా?**

DCGI (భారత ఔషధ నియంత్రణ జనరల్) ఇప్పటివరకు రెండు వ్యాక్సిన్లను - సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (SII) తయారు చేసిన కోవిషీల్డ్, మరియు భారత్ బయోటెక్ రూపొందించిన కోవాగ్జిన్ - అత్యవసర వినియోగం కోసం అనుమతించింది. వైద్య ప్రక్రియ చేయించుకున్న, లేదా ప్రస్తుతం ఏదైనా వైద్య ప్రక్రియలో ఉన్న వారికి సైతం ఈ రెండు వ్యాక్సిన్లు సురక్షితమైనవిగా పరిగణించబడుతున్నాయి. వ్యాక్సిన్ సంబంధిత వ్యతిరేక ప్రభావాలు ఉన్నవారు తప్ప, మిగిలినవారు ఈ వ్యాక్సిన్లు నిస్సందేహంగా తీసుకోవచ్చు.

వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు మీ వైద్యుడితో మీ వైద్య పరిస్థితి గురించి పూర్తిగా తెలియజేయండి. మీ వైద్య చరిత్ర, నిర్దిష్ట ఔషధాలకు ఎలర్జీ, మరియు మీరు చేయించుకున్న వైద్య ప్రక్రియలు లేదా వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు చేయించుకోవాలనుకుంటున్న ప్రక్రియల గురించి తెలియజేయండి.

***కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత కూడా మాస్క్ ధరించడం మరియు భౌతిక దూరం కొనసాగించాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు.**

**వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత, సదరు వ్యక్తి హాస్పిటల్‌లో చేరాల్సి ఉంటుందా?**

**లేదు,** కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత మీరు హాస్పిటల్‌లో చేరాల్సిన అవసరం ఉండకపోవచ్చు.

కోవిడ్-19 వ్యాక్సిన్లు సురక్షితమైనవి మరియు సమర్థవంతమైనవని నిరూపితమైన తర్వాతే భారత ఔషధ నియంత్రణ జనరల్ (DCGI) వాటికి ఆమోదం తెలిపింది.

<u>కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత క్రింది విధమైన సాధారణ దుష్ప్రభావాలు ఉండొచ్చు:</u>

- తేలికపాటి జ్వరం

- వాపు
- తలనొప్పి
- వికారం మరియు మైకము
- నొప్పి మరియు అసౌకర్యం

తేలికపాటి దుష్ప్రభావాల కోసం మీరు హాస్పిటల్‌లో చేరాల్సిన అవసరం ఉండదు. అయితే, తీవ్రమైన అలర్జీ రియాక్షన్లు, ఏదైనా అసాధారణ ఇన్ఫెక్షన్, మూర్ఛ లేదా ఏదైనా ఊహించని దుష్ప్రభావాలు కనిపిస్తే మాత్రం మీరు హాస్పిటల్‌లో చేరాల్సి ఉంటుంది. పైన పేర్కొన్న లక్షణాల్లో ఏవైనా మీ అనుభవంలోకి వస్తే, మీరు తక్షణం మీ డాక్టరుకు తెలియజేస్తే, వాళ్లు వెంటనే అవసరమైన రీతిలో స్పందిస్తారు.

మొత్తంమీద, కోవిడ్-19 వ్యాక్సిన్లు సురక్షితమైనవి, మరియు తీవ్రమైన దుష్ప్రభావాలు అరుదుగా మాత్రమే కలగవచ్చు. కాబట్టి, వ్యాక్సిన్ తీసుకోవడం సురక్షితం. తద్వారా, కరోనా వైరస్ నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చు.

**కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న వ్యక్తి కూడా క్వారంటైన్‌లో ఉండాల్సిన అవసరం ఉందా?**

ఇటీవల అప్‌డేట్ చేసిన CDC (వ్యాధి నియంత్రణ మరియు నిరోధక కేంద్రాలు) మార్గదర్శకాల ప్రకారం, పూర్తిస్థాయి వ్యాక్సిన్ తీసుకున్న వ్యక్తి కోవిడ్-19కి గురైనప్పటికీ క్వారంటైన్‌లో ఉండాల్సిన అవసరం లేదు.

వ్యాక్సిన్ తీసుకోవడం పూర్తి అయిన తర్వాత, కోవిడ్ సోకినప్పటికీ, హాస్పిటల్‌లో చేరడాన్ని మరియు వ్యాధి తీవ్రతను వ్యాక్సిన్ ప్రభావం నిరోధిస్తుంది. ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియ 4 వారాల నుండి గరిష్టంగా 12 వారాల వ్యవధితో రెండుసార్లు కండరాలకు ఇచ్చే ఇంజెక్షన్ల ద్వారా పూర్తవుతుంది. వ్యాక్సినేషన్ పూర్తి ప్రభావం అనేది చివరి డోసు తీసుకున్న రెండు వారాల తర్వాత ఉంటుంది.

వ్యాధి తీవ్రతను నివారించడంలో వ్యాక్సిన్లు చాలా ప్రభావవంతంగా పనిచేస్తున్నట్టు రుజువైనప్పటికీ, ఈ వ్యాక్సిన్లు వైరస్ వ్యాప్తిని ఎంతవరకు అడ్డుకుంటాయనే విషయమై నిశ్చయమైన పరిశోధనా అధ్యయనాలేవీ లేవు. వ్యాక్సినేషన్ 100% సమర్థవంతమైనది కానందున, క్వారంటైన్ నిబంధనలనేవి స్థానిక మార్గదర్శకాల మీద ఆధారపడి ఉంటాయి.

***కాబట్టి, పూర్తిస్థాయి వ్యాక్సిన్ తీసుకున్న వ్యక్తులు సైతం చేతులు కడుక్కోవడం, మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం లాంటి భద్రతా నియమాలు పాటించి తీరాల్సిందేనని నిపుణులు సలహా ఇస్తున్నారు.**

**కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత ఎలాంటి ఆహారం తీసుకోవడం మంచిది?**

CDC (వ్యాధి నియంత్రణ మరియు నిరోధ కేంద్రాలు) ఆహారం మరియు కరోనా వైరస్ 2019 (కోవిడ్-19)కు సంబంధించి మార్గదర్శకాల ప్రకారం, వ్యాధి తీవ్రతను తగ్గించడంలో మరియు హాస్పిటల్‌లో చేరాల్సిన పరిస్థితిని తప్పించడంలో వ్యాక్సిన్లు సమర్థవంతమైనప్పటికీ, సరైన ఆహారం తీసుకోవడం మరియు సురక్షిత పద్ధతులు పాటించడం లాంటి స్వీయ-సంరక్షణ కార్యక్రమాన్ని అనుసరించాల్సిందే.

<u>మంచి పోషకాలతో కూడిన ఆహారం విషయంలో క్రింది అంశాలూ భాగమై ఉంటాయి:</u>

• పోషకాలు సంవృద్ధిగా ఉండే సమతౌల్య ఆహారం తీసుకోండి.

• మీ వైద్యుడి సిఫార్సు మేరకు విటమిన్ సి మరియు డి, జింక్ లాంటి ఖనిజలవణాలు తీసుకోండి. ఈ పోషకాలనేవి మీ వ్యాధినిరోధకతను పెంచుతాయి మరియు వ్యాధికారక తాపం తగ్గిస్తాయి. అయితే, ఈ పోషకాలనేవి వ్యాధిని నిరోధించవు లేదా నయం చేయవు.

• తాజా పండ్లు, కూరగాయలు, పాలు మరియు సముద్ర ఉత్పత్తులు పోషకాలకు ఉత్తమ వనరులు.

• ప్రొటీన్ మరియు ముడి ధాన్యాలనేవి ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తాయి.

• విటమిన్లు లేదా డైటరీ సప్లిమెంట్లను తీసుకునే ముందు మీ టీకా వైద్యుడిని లేదా రిజిస్టర్డ్ డైటీషియన్‌ను సంప్రదించండి.

*గమనిక: గ్లూకోజ్ స్థాయిలు పెరగడం మరియు మధుమేహం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. తద్వారా, మీరు సులభంగా ఇన్ఫెక్షన్ బారినపడే అవకాశం ఉంటుంది. కాబట్టి, మీ చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంచుకోవాలి.

**కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న వ్యక్తి బయటి ప్రదేశాల్లో, రెస్టారెంట్‌లో భోంచేయవచ్చా?**

వ్యాక్సిన్(రెండు డోసులు) తీసుకున్న వ్యక్తి కూడా కోవిడ్-19 వ్యాప్తిని నిరోధించడం కోసం ప్రతిరోజు చర్యలు తీసుకోవాల్సిందే. మీరు రెస్టారెంట్‌లకు వెళ్లడం వల్ల కోవిడ్-19 సోకే అవకాశం మరియు వ్యాపించే అవకాశం పెరుగుతుంది.

బయట భోంచేయడం వల్ల ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదాన్ని అధికం అయ్యే అంశాలు:

- తినడం మరియు తాగడం కోసం మాస్క్ తొలగించాల్సి ఉంటుంది.
- రెస్టారెంట్లలో గాలి ప్రసరణ తక్కువగా ఉండడం వల్ల, గాలిలో తేలే నీటి బిందువులు అక్కడి పరిసరాల్లోనే ఉంతాయి.
- రెస్టారెంట్లలో కనీసం 6 అడుగుల దూరం కొనసాగించడం కష్టంగా ఉంటుంది.
- రెస్టారెంట్లలో మాట్లాడడం వల్ల మరిన్ని వైరస్ బిందువులు గాలిలోకి చేరుతాయి.

కాబట్టి, పూర్తిస్థాయి వ్యాక్సిన్ తీసుకున్న వ్యక్తి సైతం మరికొన్ని నెలల వరకు బయట, రెస్టారెంట్లలో (వీలైనంత వరకు) భోంచేయకపోవడమే ఉత్తమం.

**నాడిసంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవడం సురక్షితమేనా?**

భారతదేశంలో ఇస్తున్న కోవిషీల్డ్ మరియు కోవాక్సిన్ వ్యాక్సిన్లు రెండూ కూడా నాడీసంబంధిత వ్యాధిగ్రస్తులు తీసుకోవడానికి అన్ని రకాలుగా సురక్షితమైనవి. ఈ వ్యాక్సిన్లు సజీవ లేదా క్రియారహితం చేసిన వైరస్ నుండి తయారైనవి కావు. నాడీసంబంధిత వ్యాధిగ్రస్తుల్లో కోవిడ్-19 వల్ల ప్రతికూల పరిస్థితి ఏర్పడినట్టు ఎలాంటి ఆధారం లేదు. ఈ వ్యాక్సిన్ నుండి లభించే వ్యక్తిగత రక్షణ అసమానంగా ఉంటుంది.

నాడీసంబంధిత వ్యాధిగ్రస్తులకు వారి పరిస్థితి ఆధారంగా కొందరికి వ్యాక్సిన్ ఇవ్వడంలో ప్రాధాన్యత కూడా ఇవ్వబడుతుంది. ఉదాహరణకు, నాడీ-కండరాల వ్యాధి కారణంగా బలహీనమైన శ్వాసకోశ వ్యవస్థ కలిగినవారు,

అమియోట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్, మల్టిపుల్ స్క్లెరోసిస్, లేదా తీవ్రస్థాయి పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్న వారికి కూడా వ్యాక్సిన్ ఇవ్వడంలో ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. మతిమరుపు వ్యాధి ఉన్నవారు ఎల్లప్పుడూ భౌతికదూరం పాటించడం లేదా మాస్క్ ధరించడం మరచిపోయే అవకాశం ఉన్నందున వీరికి కూడా ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

అయితే, వ్యాధినిరోధకశక్తిని అదుపులో ఉంచే థెరఫీ తీసుకుంటున్న రోగులకు వ్యాక్సిన్ ఇచ్చే సమయాన్ని బట్టి, వారికి చికిత్సలో మార్పు చేయాల్సిన అవసరం కలగొచ్చు. బి సెల్ క్షీణత థెరఫీ (రిటుక్సిమాబ్)లో ఉన్న రోగుల్లో ఈ వ్యాక్సిన్ ప్రభావం క్షీణించవచ్చు.

***మీ నాడీసంబంధిత పరిస్థితి గురించి మీకు నిర్దిష్టంగా ఏవైనా ప్రశ్నలు ఉంటే, దయచేసి మీ డాక్టరుతో మాట్లాడండి.**

**కోవిడ్-19 వ్యాక్సిన్ నా గుండె కొట్టుకొనుట మీద ప్రభావం చూపుతుందా?**

ఇంజెక్షన్ చేసిన చోట నొప్పి, అలసట, తలనొప్పి, కండరాల నొప్పి, చలి, కీళ్ల నొప్పులు మరియు జ్వరం లాంటి కొన్ని తాత్కాలిక దుష్ప్రభావాలు సాధారణంగా కనిపించినప్పటికీ, కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న వారిలో తీవ్రమైన దుష్ప్రభావాలు కనిపించడం అరుదుగా మాత్రమే జరిగింది. తీవ్రమైన దుష్ప్రభావాల జాబితాలో దద్దుర్లు, వాపు మరియు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లాంటి అలర్జీ ప్రతిచర్యలు ఉన్నాయి.

<u>అనాఫైలాక్సిస్(ఒక తీవ్రమైన అలెర్జీ ప్రతిచర్యా రకం) అని దేటీకా పొందిన కొద్దిసేపటికే జరగవచ్చు. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత క్రింది లక్షణాలు ఉన్నాయేమో చూడాలి:</u>

- శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది
- గొంతు పట్టేయడం
- తలతిరిగినట్టు లేదా మైకం కమ్మినట్టు అనిపించడం
- పొత్తికడుపులో నొప్పి
- వికారం లేదా వాంతులు
- విరేచనాలు
- గుండె వేగంగా కొట్టుకోవడం
- రక్తపోటు పడిపోవడం (హైపోటెన్షన్)
- చనిపోతామేమో లాంటి భావన

కోవిడ్ వ్యాక్సినేషన్ కేంద్రాల్లో విధులు నిర్వహించే అపోలో హాస్పిటల్స్ సిబ్బంది అత్యవసర పరిస్థితులకు స్పందించే శిక్షణ తీసుకున్నారు. అలాగే, ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదుర్కోవడానికి అవసరమైన మందులు సిద్ధంగా ఉంటాయి. వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత, కనీసం 30 నిమిషాల వరకు సిబ్బంది మిమ్మల్ని పర్యవేక్షించడం ద్వారా మీలో ఎలాంటి తీవ్రమైన దుష్ప్రభావాలు ఏర్పడలేదని నిర్ధారిస్తారు.

Apollo HOSPITALS

**వ్యాక్సిన్ రెండు డోసుల మధ్య ఎంత విరామం ఉండడం మంచిది?**

ప్రస్తుతం, భారతదేశంలో కోవీషీల్డ్ మరియు కోవాగ్జిన్ అనే వ్యాక్సిన్లు ఇస్తున్నారు. వీటిలో ఏ వ్యాక్సిన్ తీసుకున్నారనే దానిపై ఈ విరామం ఆధారపడి ఉంటుంది.

ప్రభుత్వం ప్రస్తుతం పేర్కొన్న ప్రోటోకాల్ ప్రకారం, మొదటి డోసు తీసుకున్న 28 రోజుల తర్వాత రెండవ డోసు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, కోవీషీల్డ్ మీద నిర్వహించిన కొత్త పరిశోధన ప్రకారం, రెండు డోసుల మధ్య విరామం 6-12 వారాలుగా ఉంటే, బూస్టర్ డోసు మరింత సమర్థంగా ఉండొచ్చు.

డిఎన్ఏ-ఆధారిత ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్ విషయంలో రెండు దోసుల మధ్య 12 వారాల విరామం ప్రభావవంతంగా ఉంటుందని గుర్తించారు. అయితే, రెండు డోసుల మధ్య ఎంత విరామం ఉంటే మంచిదనే విషయమై మీరు మీ డాక్టరును సంప్రదించండి.

దయచేసి గుర్తుంచుకోండి. కోవీషీల్డ్ మరియు కోవాగ్జిన్ వ్యాక్సిన్లను ఒక్కోసారి ఒక్కొక్కటి అన్నట్టుగా ఉపయోగించరాదు లేదా ఇతర కోవిడ్-19 వ్యాక్సిన్లతో కలిపి ఉపయోగించరాదు. CDC మార్గదర్శకాలు సిఫార్సు చేస్తున్న ప్రకారం, ఒకే రకం కోవిడ్-19 వ్యాక్సిన్‌ను రెండు డోసులు తీసుకోవడం వల్ల వ్యాక్సిన్ సామర్థ్యం మరింత పెరుగుతుంది.

**కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవడానికి అపాయింట్మెంట్ కోసం ఏం చేయాలి?**

ముందుగా మీరు Co-Win యాప్ / ఆరోగ్య సేతు యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి లేదా https://www.cowin.gov.in లోకి లాగిన్ కావడం ద్వారా రిజిస్ట్రేషన్ స్లిప్ లేదా వ్యాక్సినేషన్ కేంద్రం టోకెన్ పొందవచ్చు. వ్యాక్సినేషన్ కోసం మీరు ఆధార్ కార్డ్ లాంటి ఏదైనా ఫోటో గుర్తింపు ఆధారం తీసుకెళ్లాలి. ముందుగా మీ శరీర ఉష్ణోగ్రత పరీక్షిస్తారు. ఈ వ్యాక్సిన్‌ను కండరంలో ఇస్తారు. కాబట్టి, మీ చేతి మీది కొంత ప్రదేశాన్ని ద్రావణంతో శుభ్రం చేస్తారు, తర్వాత ఇంజెక్షన్ ద్వారా వ్యాక్సిన్ డోసును శరీరంలోకి ఎక్కిస్తారు.

మీకు వ్యాక్సిన్ ఇచ్చిన తేదీ, వ్యాక్సిన్ వేసిన ప్రదేశం మరియు మీకు కోవిడ్-19 వ్యాక్సిన్ డోసు 1 లేదా 2 ఇచ్చారా అనే సమాచారంతో ఉన్న వ్యాక్సినేషన్ కార్డ్ లేదా ముద్రిత పత్రాన్ని మీకు అందిస్తారు. ఒక ఎలక్ట్రానిక్ రసీదు(చాలావరకు ఎస్ఎంఎస్ రూపంలో) కూడా ఇవ్వొచ్చు. రెండో వ్యాక్సిన్ డోసు ఎప్పుడు తీసుకోవాలో కూడా మీకు తెలియజేస్తారు. దీంతోపాటు, మీకు అందించే వాస్తవాల షీట్ ద్వారా కోవిడ్-19 వ్యాక్సిన్ నష్టాలు మరియు ప్రయోజనాల గురించి మీరు మరింతగా అర్థం చేసుకోవచ్చు.

మీకు వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత, వ్యాక్సిన్ కారణంగా మీ శరీరంలో ఏవైనా దుష్ప్రభావాలు ఏర్పడ్డాయా అని పరిశీలించడం కోసం మిమ్మల్ని కనీసం 30 నిమిషాలు పర్యవేక్షణలో ఉంచుతారు. వ్యాక్సిన్‌లోని పదార్థాలను స్వీకరించడానికి మీ శరీరం తిరస్కరించడం లేదా వాటికి అలవాటు పడడానికి కొంత సమయం పట్టడం వల్ల ఏర్పడే అలర్జీ ప్రతిచర్యల మీద ఆధారపడి దుష్ప్రభావాలు ఉంటాయి.

**వ్యాక్సినేషన్ కోసం అపాయింట్మెంట్ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు అనుసరించాలి?**

వ్యాక్సినేషన్ కోసం అపాయింట్మెంట్ సమయంలో క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి:

సిఫార్సు చేయబడిన స్థాయిలో చేతుల పరిశుభ్రత పాటించడంతో పాటు...

- మీ నోరు మరియు ముక్కుని మాస్క్‌తో కప్పుకోండి
- ఇతరులకు కనీసం ఆరు అడుగుల దూరంలో ఉండండి
- శ్వాసకోశ పరిశుభ్రత/దగ్గు సమయంలో పాటించే నియమాలన్నీ పాటించండి

**ఏవైనా తీవ్రమైన అనారోగ్యాల కోసం ఔషధాలు తీసుకుంటున్న వారు కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవచ్చా?**

క్యాన్సర్ లాంటి కొన్ని తీవ్రమైన వ్యాధులు లేదా కొన్ని రకాల గుండె జబ్బులతో బాధపడుతూ, వాటికోసం మందులు తీసుకుంటున్న వారు మరింత సులభంగా కోవిడ్-19 బారినపడడంతో పాటు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి, ఇలాంటి వారు కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవాలని మరింత గట్టిగా సిఫార్సు చేయడమైనది. అయితే, వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు వాళ్లు వారి స్పెషలిస్ట్ డాక్టర్లను కలసి అభిప్రాయం తీసుకోవాలి. ఎందుకంటే, కొందరిలో వ్యాక్సిన్ కారణంగా కలిగే దుష్ప్రభావాలు తీవ్రంగా ఉండడంతో పాటు వారిని ఇబ్బందుల్లోకి నెట్టవచ్చు. కాబట్టి, తీవ్రమైన అనారోగ్యాలతో బాధపడే వారు కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవాలనే సిఫార్సు ఉన్నప్పటికీ, వాళ్లు అత్యంత జాగ్రత్తతో తీసుకోవాలి.

**కోవిడ్ వ్యాక్సిన్ మొదటి డోసు తీసుకున్నప్పుడు ఎవరికైనా తీవ్రమైన దుష్ప్రభావాలు తలెత్తితే, అతను/ఆమె రెండో డోసు తీసుకోవడాని అర్హులా?**

అందరూ తప్పక తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే, కోవిడ్ వ్యాక్సిన్ మొదటి డోసు తీసుకున్నప్పుడు కొందరిలో కొన్ని దుష్ప్రభావాలు కలిగే అవకాశం ఉంది. అయితే, కొన్ని సందర్భాల్లో ఈ దుష్ప్రభావాలనేవి భరించలేని స్థాయి నుండి ఎప్పుడూ అనుభవంలోకి రానివిగా ఉండవచ్చు. మొదటి డోసు తీసుకున్నప్పుడు తలనొప్పి, మైకం మరియు ఒంటి నొప్పులు మొదలుకొని తీవ్రమైన అలసట మరియు ఫ్లూ లాంటి దుష్ప్రభావాలు ఏర్పడితే, అవి నయమయ్యే వరకు వేచి ఉండాలి. ఆ సమయంలో అవసరమైనప్పుడల్లా డాక్టర్‌ని సంప్రదిస్తూ, ఆ రోజుల్లో వచ్చే మార్పులను గమనించాలి. రోజులు గడుస్తున్న కొద్దీ పరిస్థితి మెరుగుపడితే, వైద్యుడి సలహా మేరకు రెండో డోస్ తీసుకోవడం మంచిది. మీ శరీరంలోకి ప్రవేశించిన వ్యాక్సిన్ చక్కగా పనిచేస్తోందని చెప్పే మరో వైద్య సంకేతంగానే ఈ ప్రతిచర్యలను పరిగణించాలి. ఈ ప్రతిచర్యలనేవి అత్యంత అధ్వాన్నంగా మరియు నియంత్రించలేని స్థాయికి చేరుతున్న పరిస్థితిలో తప్ప వీటి గురించి ఆందోళన అవసరం లేదు. 40% నుండి 50% మందిలో రెండో డోసు తీసుకున్న తర్వాత ఇలాంటి దుష్ప్రభావాలు కనిపించాయి.

**నేను కోవిడ్ నుండి కోలుకున్నాను. నేను కూడా కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవాలా?**

**అవును,** గతంలో మీరు కోవిడ్-19 ఇన్ఫెక్షన్‌కు గురైనవారు అయినప్పటికీ, పూర్తిస్థాయి కోవిడ్-19 వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని సలహా ఇవ్వడమైనది. ఈ వ్యాధికి వ్యతిరేకంగా మీలో బలమైన వ్యాధినిరోధకత అభివృద్ధి చెందడంలో ఇది సహాయపడుతుంది.

కోవిడ్-19 ఇన్ఫెక్షన్ సోకినప్పుడు మీ శరీరం దానికి వ్యతిరేకంగా రక్షణాత్మక ప్రతిరోధకాలు సృష్టించడం ద్వారా సహజమైన, క్రమబద్ధమైన రోగనిరోధక శక్తిని పెంపొందించుకుంటుంది. అలాగే, కోవిడ్-19 వ్యాక్సిన్ అనేది ఈ ఇన్ఫెక్షన్‌ను గుర్తించి, దానితో పోరాడేలా మీ శరీరానికి శిక్షణ ఇవ్వడం ద్వారా పనిచేస్తుంది. దీనినే 'వ్యాక్సిన్ ద్వారా లభించిన వ్యాధినిరోధక' అని పిలుస్తారు. ఏవిధంగా అయినప్పటికీ, ఈ రెండూ మీ శరీరంలో వ్యాధినిరోధకతను పెంపొందిస్తాయి. అయితే, పరిమిత పరిశోధన కారణంగా, సహజంగా లభించిన వ్యాధినిరోధకత ఎంతకాలం ఉంటుందో తెలియదు. ఈ నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా మళ్లీ ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు, మీరు కోవిడ్-19కి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, మీరు ఇప్పటికే కోవిడ్ నుండి కోలుకున్నప్పటికీ, కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల భవిష్యత్తులో సోకే కోవిడ్-19 ఇన్ఫెక్షన్‌ను ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.

**ప్రస్తుత కోవిడ్ వ్యాక్సినేషన్ పిల్లలకూ సురక్షితమేనా?**

కోవిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమం పూర్తి చేయడం వల్ల, కోవిడ్ సోకినప్పటికీ హాస్పిటల్‌లో చేరడం, వ్యాధి తీవ్రతను నివారించడం సాధ్యమవుతుందనేది వాస్తవమే అయినప్పటికీ, ప్రస్తుతం అందుబాటులో ఉన్న కోవిడ్-19 వ్యాక్సిన్లు తీసుకోవడానికి పిల్లలు (ప్రస్తుతానికి) అర్హులు కాదు. పిల్లల్లో కోవిడ్-19 వ్యాక్సిన్ల భద్రత మరియు సామర్థ్యం గురించి ప్రస్తుతానికి సమాచారం లేదు. కాబట్టి, కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోగల అతితక్కువ వయసు పరిమితిని వ్యాక్సిన్ తయారీ సంస్థలు క్రింది విధంగా నిర్దేశించాయి:

1. కోవీషీల్డ్® వ్యాక్సిన్ తయారు చేస్తున్న సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రకారం, ఈ వ్యాక్సిన్‌ను 18 సంవత్సరాలు నిండినవారు లేదా అంతకంటే ఎక్కువ వయసు వారు తీసుకోవచ్చు.
2. కోవాగ్జిన్® వ్యాక్సిన్ తయారు చేస్తున్న భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రకారం, ఈ వ్యాక్సిన్‌ను 18 సంవత్సరాలు నిండినవారు లేదా అంతకంటే ఎక్కువ వయసు వారు తీసుకోవచ్చు.

గతంలో, DCGI (భారత ఔషధ నియంత్రణ జనరల్) ఆమోదించిన ప్రకారం, 12 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు పిల్లలకు కోవాగ్జిన్® వ్యాక్సిన్ ఇవ్వొచ్చు. కోవాగ్జిన్® వ్యాక్సిన్ ఫేజ్ 2 క్లినికల్ ట్రయల్స్‌లో 12 నుండి 65 సంవత్సరాల మధ్య వయసులోని 380 మంది పాల్గొన్నారు.

**వ్యాక్సిన్ రెండో డోసు తీసుకున్న తర్వాత నాకు కోవిడ్-19 పాజిటివ్ వచ్చే అవకాశం ఉందా?**

**ఉంది**. వ్యాక్సిన్ అనేది 100% సమర్థవంతమైనది కాదు. కాబట్టి, వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత కూడా కోవిడ్-19 ఇన్ఫెక్షన్ కారణంగా మీకు పాజిటివ్ వచ్చే అవకాశం ఉంది. కోవిడ్-19 వ్యాక్సిన్ అనేది తక్షణ రక్షణ అందించదు. అలాగే, ఇది వ్యాధిని నిరోధించదు.

కోవిడ్-19 వ్యాక్సిన్ అనేది హాస్పిటల్‌లో చేరాల్సిన అవసరాన్ని మరియు వ్యాధి తీవ్రతను నిరోధిస్తుంది. పూర్తి స్థాయిలో వ్యాక్సినేషన్ తీసుకున్న తర్వాత మాత్రమే దాని ప్రయోజనాలు లభిస్తాయి. కనీసం 4 వారాల నుండి గరిష్టంగా 12 వారాల వరకు వ్యవధితో రెండుసార్లు కండరాల్లోకి ఇచ్చే ఇంజెక్షన్ల ద్వారా ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం పూర్తవుతుంది.

వ్యాక్సిన్ తర్వాత కూడా, మీకు SARS-CoV-2 వైరస్ ఇన్ఫెక్షన్ రావొచ్చు. అయితే, మీలో ఎలాంటి లక్షణాలు కనిపించకుండా, మీరు వైరస్ క్యారియర్‌గా మారుతారు, మీ వల్ల ఇతరులకు వ్యాధి సోకే అవకాశం ఉంటుంది.

కాబట్టి, మీరు పూర్తిస్థాయిలో వ్యాక్సిన్ తీసుకున్నప్పటికీ, SARS-CoV-2 వైరస్ సోకినప్పుడు మీకు పాజిటివ్ రావొచ్చు. అందుకే, స్వీయ-రక్షణ మరియు ఇతరులకు వైరస్‌ను విస్తరించడం నిరోధించడం కోసం వ్యాక్సిన్ తీసుకున్న వ్యక్తులు కూడా భద్రతా ప్రమాణాలు అనుసరించాలని నిపుణుల సలహా.

**కోవిడ్-19 వ్యాక్సిన్ నా కంటిచూపు మీద ప్రభావం చూపుతుందా?**

**లేదు.** కోవిడ్-19 వ్యాక్సినేషన్ కారణంగా కంటిచూపు ప్రభావితమైనట్టు ఇప్పటివరకు, ఎలాంటి నివేదికలు లేవు. పూర్తి స్థాయిలో వ్యాక్సినేషన్ తర్వాత మాత్రమే వ్యాక్సిన్ ప్రయోజనాలు లభిస్తాయి. కోవిడ్-19 వ్యాక్సిన్ కారణంగా 10లో ఒకరిలో క్రింది అత్యంత సాధారణ దుష్ప్రభావాలు కనిపించవచ్చు. అవి:

- నొప్పి, ఎర్రబడడం, మరియు ఇంజెక్షన్ ఇచ్చిన ప్రదేశంలో వాపు.
- అస్వస్థగా ఉన్న భావన మరియు అలసట
- జ్వరం, చలి, మరియు గొంతు మంట, ముక్కు కారడం, మరియు దగ్గు వంటి ఫ్లూ లక్షణాలు
- శరీరం మీద దురద మరియు కీళ్ల నొప్పి

ఈ వ్యాక్సిన్లు ఇంకా క్లినికల్ ట్రయల్స్ దశలోనే ఉండడం వల్ల, కొన్ని తీవ్రమైన మరియు ఊహించని దుష్ప్రభావాలు సైతం సంభవించవచ్చు.

ఈ దుష్ప్రభావాలు కొన్ని రోజుల్లోనే తగ్గిపోతాయి. మొదటి డోసు తీసుకున్న తర్వాత కొన్ని దుష్ప్రభావాలు కనిపించినప్పటికీ, రెండో డోసు తీసుకోండి. ఏవైనా తీవ్రమైన అలెర్జీ ప్రతిచర్య మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంటే, లేదా రోజులు గడుస్తున్నా తగ్గకపోతే, మీ డాక్టరుతో మాట్లాడండి.

**కోవిడ్-19 వ్యాక్సిన్ కారణంగా నా కండరాలు బలహీనమవుతాయా?**

కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్నప్పుడు ఇంజెక్షన్ చేసిన చోట నొప్పి, ఎర్రబడటం, వెచ్చదనం, తేలికపాటి వాపు లేదా గట్టిపడడం లాంటివి మీకు కలగవచ్చు. అయితే, వ్యాక్సిన్ వల్ల మీ కండరాలు బలహీన పడుతాయనేందుకు ఎలాంటి ఆధారం లేదు. చేయి సున్నితంగా మారినట్టు, కదిలించడం కష్టమైనట్టు మీకు అనిపించవచ్చు. కానీ, దీనివల్ల కండరాల బలహీనత సంభవించదు.

ఇంజెక్షన్ చేసిన ప్రదేశంలో నొప్పి ఉంటే, మందుల దుకాణం నుండి నొప్పి నివారణ ఔషధాలు కొని, ఉపయోగించవచ్చు. జ్వరం, తలనొప్పి, కండరాలు, లేదా కీళ్ల నొప్పి నుండి కూడా ఈ మందులు ఉపశమనం కలిగిస్తాయి.

అయితే, కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు మాత్రం ఎలాంటి నొప్పి నివారణలు తీసుకోకూడదని గుర్తుంచుకోండి. అలాచేస్తే, వ్యాక్సిన్‌కు మీ శరీరంలోని సహజ వ్యాధినిరోధక ప్రతిస్పందన దెబ్బతినవచ్చు.

**రేడియోథెరఫీకి వెళ్తున్న పరిస్థితుల్లోనూ నేను వ్యాక్సిన్ తీసుకోవడం సురక్షితమేనా?**

**సురక్షితమే.** కోవిడ్ వ్యాక్సిన్‌ను రేడియోథెరఫీ తీసుకుంటున్న లేదా తీసుకున్న వ్యక్తులకు కూడా ఇవ్వొచ్చు. క్యాన్సర్ చికిత్సలు, ప్రత్యేకించి కీమోథెరపీ కారణంగా వ్యాధినిరోధక శక్తి తగ్గిపోతుంది. అలాంటి పరిస్థితుల్లో, 'సజీవ' వ్యాక్సిన్ల కారణంగా సమస్య తలెత్తే అవకాశం ఉంది. కోవిడ్-19 వ్యాక్సిన్లు 'సజీవ' వ్యాక్సిన్లు కావు. క్యాన్సర్ పేషెంట్లు కూడా కోవిడ్-19 వ్యాక్సిన్లు తీసుకోవచ్చని క్యాన్సర్ ఇమ్యూనోథెరఫీ నిపుణులు సిఫార్సు చేశారు.

క్యాన్సర్ చికిత్సకు ముందు, చికిత్స సమయంలో, లేదా చికిత్స తర్వాత కూడా వ్యాక్సిన్లు ఇవ్వొచ్చు. రోగనిరోధకతను అణచిపెట్టే ఇతర మందులుతో కలిపి కీమోథెరపీ లేదా క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్న పేషెంట్లకు కోవిడ్-19 వ్యాక్సిన్ ఇస్తే, వారిలో వ్యాధినిరోధకత సామర్థ్యం మళ్లీ ఉత్తేజితం కావచ్చు కాబట్టి, వారికి రెండోసారి వ్యాక్సిన్ ఇవ్వడం ప్రస్తుతానికి మంచిది కాదు.

సలహా లేదా సహాయం కోసం మీరు అపోలో హాస్పిటల్స్‌లోని క్యాన్సర్ నిపుణులతో మాట్లాడవచ్చు.

**కోవిడ్-19 వ్యాక్సినేషన్ కారణంగా పురుషుల్లో లేదా మహిళల్లో సంతాన సాఫల్యత లోపం ఏర్పడుతుందా?**

**లేదు.** ఇది కేవలం పుకారు మరియు తప్పుడు సమాచారం. కోవిడ్-19 వ్యాక్సినేషన్ కారణంగా పురుషుల్లో లేదా మహిళల్లో సంతాన సాఫల్యత లోపం ఏర్పడినట్టుగా ఇప్పటివరకు కనీసం ఒక్క ఆధారం కూడా లేదు. కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత గర్భవతులైన మహిళల్లోనే కాకుండా, గర్భవతిగా ఉన్నప్పుడు వ్యాక్సిన్ తీసుకున్న మహిళల్లో కూడా సురక్షితంగా ప్రసవం జరిగినట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. కాబట్టి, వాస్తవాల ఆధారంగా, వ్యాక్సిన్ కారణంగా సంతాన సాఫల్య లోపం ఏర్పడినట్టు చెప్పే కొద్దిపాటి సమాచారం గానీ, ఆధారం గానీ లేదు.

**కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత కూడా RT-PCR టెస్ట్‌లో పాజిటివ్ వచ్చే అవకాశం ఉందా?**

**అవును.** అయితే, ఈ విషయంలో ఒక 'మినహాయింపు' కూడా ఉంది. మీరు వ్యాక్సిన్ మొదటి డోసు తీసుకున్న తర్వాత, మాస్క్, చేతుల-పరిశుభ్రత మరియు భౌతిక దూరం లాంటి సరైన రక్షణ లేకుండా కోవిడ్-19 పాజిటివ్ వ్యక్తితో సన్నిహితంగా మెలిగినప్పుడు RT-PCR పరీక్షలో మీకు పాజిటివ్ వచ్చే అవకాశాలు ఎక్కువ. వ్యాక్సిన్ రెండో డోసు తీసుకున్న తర్వాత కూడా అదే పరిస్థితి ఉంటుంది.

పరిశోధకులు పేర్కొంటున్న ప్రకారం, ప్రతి వ్యక్తిలో కణ ప్రతిస్పందన వ్యవధి అనేది భిన్నంగా ఉంటుంది. అలాగే, వ్యాధినిరోధక వ్యవస్థ కూడా ఒక్కొక్కరిలో ఒక్కో విధంగా ఉంటుంది. వ్యాక్సిన్ అనేది ఒక రక్షణ కవచం లాంటిది. వ్యక్తిలోని వ్యాధినిరోధక వ్యవస్థ మీద ఆధారపడి, వ్యాక్సిన్ రక్షణ మొదలుకావడానికి రోజు, లేదా వారం, లేదా నెల పట్టవచ్చు.

అదేవిధంగా, వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత, మీ శరీరం కోవిడ్-19 వైరస్ ఇన్ఫెక్షన్‌ను ఎదుర్కొనేలా మరియు వ్యాప్తిని నిరోధించేలా సర్దుబాటు కావడానికి కూడా నిర్దిష్ట సమయం పడుతుంది.

కాబట్టి, వ్యాక్సిన్ ప్రభావం వెంటనే మొదలయ్యే అవకాశాలు చాలా తక్కువగానే ఉంటుంది. కాబట్టి, వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత కూడా కోవిడ్-19 నిరోధ చర్యలను ఎప్పటిలాగే కొనసాగించాలి.

**కోవిడ్-19 వ్యాక్సిన్ వల్ల నా డిఎన్ఏలో మార్పులు జరుగుతాయా?**

**ఈమాట నిజం కాదు**. ప్రపంచంలోని చాలామందికి ఇప్పటికే కోవిడ్-19 వ్యాక్సిన్ ఇచ్చారు. అయినప్పటికీ, కొందరు మాత్రం వ్యాక్సిన్ తీసుకుంటే డిఎన్ఏలో శాశ్వతమైన మార్పు జరుగుతుందనే భయంతో వ్యాక్సిన్ తీసుకోవడానికి సందేహిస్తున్నారు. అలాంటి సమాచారాన్ని నమ్మే ముందు మీరు **ఈ సమాచారం ఎక్కడి నుండి లభించిందో** పరిశీలించండి.

**రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత కూడా భౌతిక దూరం పాటించడం తప్పనిసరా?**

**అవును**. వ్యాక్సిన్ ద్వారా గరిష్ట ప్రభావం మొదలుకావడానికి కొన్నిరోజుల నుండి, కొన్నిసార్లు అనేక వారాలు కూడా పట్టవచ్చు. కాబట్టి, రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకున్నవారు కూడా భౌతిక దూరం పాటించాల్సిందేనని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

అలాగే, రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల కోవిడ్-19 సోకితే తీవ్రంగా జబ్బుపడే అవకాశం తగ్గడం నిజమే అయినప్పటికీ, వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల మీరు వైరస్ బారినపడరని మరియు/లేదా ఇతరులకు వ్యాపింపజేయరని చెప్పే ఆధారాలు ప్రస్తుతానికి లేవు. కాబట్టి, రెండో డోసు తీసుకున్నప్పటికీ, మీరు స్వీయ-రక్షణ పాటించడం చాలా ముఖ్యం.

**రెండో డోసు తీసుకున్న తర్వాత కూడా మాస్క్ ధరించడం తప్పనిసరా?**

**అవును.** మరికొంతకాలం మీరు మాస్క్ ధరించడాన్ని కొనసాగించాలి. వ్యాక్సిన్ తీసుకోవడమంటే, ఆ క్షణం నుండి మనం సాధారణ జీవితంలోకి వెళ్లిపోవచ్చని అర్థం కాదు. మనం ఇంకా సమూహ వ్యాధినిరోధకత సాధించాల్సి ఉంది. ప్రస్తుతానికి, వ్యాక్సిన్ అనేది కోవిడ్-19 మహమ్మారికి సంబంధించి మరో స్థాయి రక్షణ మాత్రమే. అలాగే, సమూహ వ్యాధినిరోధకత సాధించాలంటే, జనాభాలో 50 నుండి 80 శాతం మందికి వ్యాక్సిన్ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

వ్యాక్సిన్ రెండో డోసు తీసుకున్న తర్వాత కనీసం రెండు వారాలకు గానీ మీరు గరిష్ట సామర్థ్యానికి చేరరు. ఆ తర్వాతే, మీ వ్యాధినిరోధకత పెరగడమనేది మొదలవుతుంది. అయితే, ఈ విషయమై ప్రస్తుతం తీవ్రమైన పరిశోధనలు సాగుతున్నాయి. మొదటి డోసు తీసుకున్న తర్వాత, మీలో పాక్షిక వ్యాధి నిరోధకత ప్రతిస్పందన మొదలైనప్పటికీ, వ్యాక్సిన్ తీసుకున్న వెంటనే మీకు పూర్తి రక్షణ దొరికినట్టు కాదు.

వ్యాక్సిన్ తీసుకున్నవారు కూడా మాస్క్ ధరించాలని చెప్పడానికి మరొక ముఖ్యమైన కారణం ఏమిటంటే, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు (గుండె జబ్బులు మరియు క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వైద్య పరిస్థితుల కారణంగా)

మరియు వ్యాక్సిన్ తీసుకునే స్థితిలో లేని వారిని (మొదటి మోతాదుకు అలెర్జీ ప్రతిచర్యకు గురైనవారు, అధిక ప్రమాద తీవ్రత కలిగిన గర్భవతులు మొదలైనవారిని) మనం కాపాడుకోవాల్సి ఉంది.

**కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న వ్యక్తి కూడా కోవిడ్-19ను వ్యాపింపజేసే అవకాశం ఉందా?**

**ఉంది.** వ్యాక్సిన్ తీసుకున్న వ్యక్తులు సైతం కోవిడ్-19 ఇన్ఫెక్షన్ వ్యాపింపజేయగలరు మరియు దానికి గురికాగలరు. వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల, కోవిడ్ కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం నుండి మీకు గణనీయమైన రక్షణ లభిస్తుంది. అయితే, వ్యాక్సిన్ తీసుకున్నప్పటికీ, మీరు కోవిడ్-19 వ్యాధి బారిన పడవచ్చు మరియు వ్యాధినిరోధకత లేని వారికి మీరు దానిని వ్యాపింపజేయవచ్చు. ఒకానొక అధ్యయనం ప్రకారం, ఇన్ఫెక్షన్ సోకినప్పటికీ, లక్షణాలు లేని లేదా లక్షణాలు కనిపించని వ్యక్తులు 24 శాతం వ్యాధి వ్యాప్తికి కారణమవుతున్నారు.

కొందరు నిపుణుల ప్రకారం, వ్యాక్సినేషన్ తీసుకున్న తర్వాత, దాని ప్రభావం మొదలు కావడానికి కనీసం 12 రోజులు పడుతుంది. వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల, తీవ్రమైన అనారోగ్యం బారిన పడకుండా రక్షణ లభిస్తుంది. కాబట్టి, వ్యాక్సిన్ తీసుకున్న వ్యక్తులు కూడా మాస్క్ ధరించడం, చేతులు కడుక్కోవడం, మరియు సరైన భౌతిక దూరం పాటించడం కొనసాగించాలి.

**గుల్లెయిన్-బారే సిండ్రోమ్ కలిగిన పేషెంట్ కూడా వ్యాక్సిన్ తీసుకోవచ్చా?**

**తీసుకోవచ్చు.** గుల్లెయిన్-బారే సిండ్రోమ్ ఉన్నప్పటికీ వ్యాక్సిన్ తీసుకోవచ్చు కేవలం వ్యాక్సిన్‌ను వారి శరీరం వ్యతిరేకించే పరిస్థితి ఉన్నవారు తప్ప. చాలావరకు కోవిడ్-19 వ్యాక్సిన్లు సార్స్-CoV-2 ప్రోటీన్ ఉపయోగించి అభివృద్ధి చేయబడిన కారణంగా, వీటివల్ల గుల్లెయిన్-బారే సిండ్రోమ్‌లో చెప్పుకోదగ్గ పెరుగుదల కనిపించలేదు.

గుల్లెయిన్-బారే అనేది ఒక తీవ్రమైన ఇన్ఫ్లమేటరీ బార్డర్‌లైన్ రుగ్మత. దీనిప్రభావం కొన్నిసార్లు తీవ్రంగా ఉంటుంది మరియు కొన్నిసార్లు శాశ్వత పక్షవాతానికి దారితీస్తుంది. అంతేకాకుండా, గుల్లెయిన్-బారే సిండ్రోమ్ కలిగిన వారిలో మూడింట ఒకవంతు మంది శ్వాసకోశ వైఫల్యానికి గురవుతారని, ఈ కారణంగా వారికి ఐసియు మరియు వెంటిలేషన్ చికిత్స అవసరమవుతుందని కూడా నిర్ధారించబడింది.

నిజానికి, కోవిడ్ వ్యాక్సిన్ వల్ల గుల్లెయిన్-బారే సిండ్రోమ్ వ్యక్తుల్లో కలిగే వ్యక్తిగత ప్రమాదం చాలా తక్కువ. ఇది కూడా ఇతర సమస్యల లాగే ఉంటుంది. అయితే, కోవిడ్-19 నుండి రక్షణ అనే రూపంలో చూసినప్పుడు ఈ సమస్యల కంటే లాభమే ఎక్కువ.

ప్రతి వ్యాక్సిన్ విషయంలో కొద్దిపాటి దుష్ప్రభావాలు ఉండే అవకాశం ఉందని మీరు అర్థం చేసుకోవడం ముఖ్యం. కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల గుల్లెయిన్-బారే సిండ్రోమ్ తీవ్రమైన కేసులేవీ ఇప్పటివరకు నివేదించబడలేదు.

**ఊపిరితిత్తుల క్యాన్సర్ పేషెంట్లను కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?**

ఆరోగ్య సంరక్షణ నిపుణుల సిఫార్సు ప్రకారం, క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తులు తప్పనిసరిగా కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవాలి. సాధారణంగా, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులు కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవచ్చు. అయితే, తీసుకుంటున్న కీమోథెరపీ ఆధారంగా వారు తమ వ్యాధినిరోధక స్థితి గురించి డాక్టరుతో మాట్లాడాలి.

అయితే, వారు వ్యాక్సిన్ తీసుకోవడమనేది వారి ఆరోగ్య స్థితి మీద ఆధారపడి ఉంటుంది. సదరు పేషెంట్‌కి దేనికి సంబంధించైనా తీవ్రమైన ప్రతిచర్య లేదా అలర్జీ ఉంటే వ్యాక్సిన్ తీసుకునేముందు డాక్టరును సంప్రదించాలి.

వ్యాక్సిన్ రకం మీద మరియు క్యాన్సర్ సంక్లిష్టత మీద ఆధారపడి, కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల సంభవించగల ప్రతికూలతలను తొలగించుకోవడానికి ముందుగా వారి ఫిజీషియన్‌ను సంప్రదించి అనుమానాలు నివృతి చేసుకోవాలి. వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు, సదరు క్యాన్సర్ పేషెంట్ ఇంకా క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్నారా లేదంటే అతను/ఆమె వ్యాధినిరోధక వ్యవస్థ చక్కగా పనిచేస్తోందా అనే విషయం నిర్ధారించుకోవాలి.

మీకు లేదా మీకు ఇష్టమైన వారికి ఊపిరితిత్తుల క్యాన్సర్ ఉంటే, వ్యాక్సినేషన్ కోసం రిజిస్టర్ చేసుకోవడానికి ముందు మీకు చికిత్స చేసే డాక్టరును సంప్రదించండి. వ్యాక్సిన్‌లో ఉపయోగించిన లవణాలు మరియు రసాయనాలను మీ శరీరం సురక్షితంగా తట్టుకోగలదా అని నిర్ధారించుకోండి.

**ఛాతి నొప్పి ఉన్న పేషెంట్లను కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?**

నిపుణులు చెబుతున్న ప్రకారం, కార్డియోవస్కులార్ వ్యాధులు ఉన్నవారు కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవడం పూర్తిగా సురక్షితం. ఏరకమైన ఛాతినొప్పి ఉన్నవారైనా వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా, వారు మరియు వారికి ఇష్టమైన వారు కోవిడ్-19 వ్యాధి బారిన పడడాన్ని నిరోధించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం ఆమోదం పొందిన వ్యాక్సిన్లు తీసుకోవడం వల్ల ఎలాంటి చెప్పుకోదగ్గ లేదా నిర్దిష్ట సమస్యలు తలెత్తిన దాఖలాలు లేవు. కాబట్టి, వీటిని తీసుకోవడం సురక్షితం. చాలామంది వైద్య నిపుణుల ప్రకారం, వ్యాక్సిన్ తీసుకోవడం సురక్షితం మాత్రమే కాకుండా, ఛాతి నొప్పి ఉన్నవారిలో అది గుండె సంబంధిత వ్యాధిగా మారే అవకాశం ఉండడం వల్ల వారు వ్యాక్సిన్ తీసుకోవడం తప్పనిసరి.

కోవిడ్-19 వ్యాక్సిన్ అనేది ఒక ప్రొటీన్ నుండి తయారు చేయబడింది. వైరస్‌ను ఎదుర్కోగల స్థాయిలో ఇది వ్యాధి నిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. అమెరికన్ హార్ట్ ఫెయిల్యూర్ సొసైటీ బలంగా సిఫార్సు చేస్తున్న ప్రకారం, కోవిడ్-19 వ్యాక్సిన్ సురక్షితమైనది మరియు గుండె సంబంధిత సమస్యలున్న వారికి ఇది ప్రభావితమైనది.

**రుతు స్రావం కొనసాగుతున్న మహిళల మీద కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావం చూపుతుందా?**

కోవిడ్ అనేది ఒక శ్వాసకోశ వ్యాధి. కోవిడ్‌తో బాధపడుతున్న వ్యక్తితో ప్రత్యక్ష పరిచయం లేదా కోవిడ్-19 పాజిటివ్ వ్యక్తి తాకిన ఉపరితలం తాకడం ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి తీవ్రత అనేది వ్యక్తుల్లో సాధారణం లేదా మోస్తరు స్థాయిల్లో కనిపిస్తుంది. ఈ మహమ్మారి వ్యాధి కోసం వ్యాక్సిన్లు ఇప్పటికే తయారు చేశారు. ప్రపంచవ్యాప్త మహిళలు ఈ వ్యాక్సిన్ తీసుకుంటున్నారు. వ్యాక్సిన్ తీసుకున్న మహిళల్లో నిర్వహించిన సర్వేల ప్రకారం, వ్యాక్సిన్ వల్ల వారి

రుతుచక్రం మీద చెప్పుకోదగ్గ ప్రభావమేదీ కనిపించలేదు. వ్యాక్సిన్ తీసుకున్న మహిళల్లో నెలసరి ఆలస్యం కావడం లేదా తప్పిపోవడం జరగలేదు.

అయితే, ఈ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల సంతాన సాఫల్య సామర్థ్యం తగ్గిపోతుందనే అపోహ కారణంగా, చాలామంది మహిళలు ఈ వ్యాక్సిన్ తీసుకోవడానికి వెనకడుగేస్తున్నారు. అయితే, అనేకమంది వైద్యుల ప్రకటనలు మరియు పరీక్షల ప్రకారం, ఈ అపోహకు కనీసం ఆధారం కూడా లేదు.

**కోవిడ్ వ్యాక్సినేషన్ కోసం ఎలా రిజిస్టర్ చేసుకోవాలి?**

60 సంవత్సరాలు పైబడినవారు మరియు క్లిష్టమైన వ్యాధులు ఉన్న 45 ఏళ్లు పైబడినవారి కోసం మార్చి, 1, 2021 ఉదయం 9:00 గం. నుండి రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయి. క్రింది లింక్ ద్వారా మీరు ఈ పోర్టల్‌ను యాక్సెస్ చేయవచ్చు: https://www.cowin.gov.in/

<u>వయోవృద్ధులు (60 ఏళ్లు పైబడినవారు) కోసం కోవిడ్ వ్యాక్సిన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ:</u>

1. కో-విన్ యాప్, ఆరోగ్య సేతు యాప్ ఉపయోగించండి లేదా https://www.cowin.gov.in కి లాగిన్ చేయండి.
2. మీ మొబైల్ నంబర్ నమోదు చేయండి
3. అకౌంట్ రూపొందించడం కోసం OTP తో నమోదు చేసుకోవాలి.
4. మీ పేరు, వయస్సు, లింగం నమోదు చేయండి మరియు ఫోటో గుర్తింపు పత్రం (ఆధార్ కార్డ్, ఓటరు గుర్తింపు కార్డు (EPIC), పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, NPR స్మార్ట్ కార్డ్, ఫోటోతో ఉండే పెన్షన్ డాక్యుమెంట్) అప్‌లోడ్ చేయండి.
5. తేదీ మరియు కోవిడ్ వ్యాక్సినేషన్ కేంద్రం ఎంచుకోండి
6. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఒక రసీదు (రిజిస్ట్రేషన్ స్లిప్ లేదా టోకెన్) వస్తుంది. దీనిని డౌన్‌లోడ్ మరియు ముద్రించే సౌలభ్యం కూడా ఉంటుంది.
7. ఒక మొబైల్ నంబర్ ద్వారా 4 అపాయింట్‌మెంట్లు బుక్ చేయవచ్చు.

**సాంకేతికత ఉపయోగించే పరిస్థితిలో లేని వయో వృద్ధుల కోసం ఇతర ఎంపికలు కూడా ఉన్నాయి.**

- ఎంపిక **1:** వాళ్లు నేరుగా కోవిడ్ వ్యాక్సినేషన్ కేంద్రానికి వెళ్లి, అక్కడ స్వయంగా నమోదు చేసుకోవచ్చు.
- ఎంపిక **2:** పై సౌకర్యం పొందడానికి వాళ్లు 1507కి ఫోన్ చేయవచ్చు

<u>క్లిష్టమైన ఆరోగ్య సమస్యలు కలిగిన 45 ఏళ్లు పైబడిన వారి కోసం:</u>

1. కో-విన్ యాప్, ఆరోగ్య సేతు యాప్ ఉపయోగించండి లేదా https://www.cowin.gov.inకి లాగిన్ చేయండి.
2. మీ మొబైల్ నంబర్ నమోదు చేయండి

3. అకౌంట్ రూపొందించడం కోసం OTP తో నమోదు చేసుకోవాలి
4. మీ పేరు, వయస్సు, లింగం నమోదు చేయండి మరియు ఫోటో గుర్తింపు పత్రం (ఆధార్ కార్డ్, ఓటరు గుర్తింపు కార్డు (EPIC), పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, NPR స్మార్ట్ కార్డ్) అప్‌లోడ్ చేయండి.
5. సంక్లిష్ట వ్యాధికి ఆధారంగా మీ డాక్టర్ సంతకంతో ఉన్న సంక్లిష్ట వ్యాధి సర్టిఫికేట్ అప్‌లోడ్ చేయండి
6. తేదీ మరియు కోవిడ్ వ్యాక్సినేషన్ కేంద్రం ఎంచుకోండి
7. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఒక రసీదు (రిజిస్ట్రేషన్ స్లిప్ లేదా టోకెన్) వస్తుంది. దీనిని డౌన్‌లోడ్ చేసే మరియు ముద్రించే సౌలభ్యం కూడా ఉంటుంది.
8. ఒక మొబైల్ నంబర్ ద్వారా 4 వరకు అపాయింట్‌మెంట్లు బుక్ చేయవచ్చు.

***గమనిక:**

ప్రతి డోస్ తీసుకునే సమయంలో ఒక లబ్దిదారు కోసం ఒకే ఒక లైవ్ అపాయింట్‌మెంట్ మాత్రమే అందుబాటులో ఉంటుంది. కోవిడ్ వ్యాక్సినేషన్ కేంద్రాల్లో ఏదైనా ఒక తేదీ కోసం అపాయింట్‌మెంట్లు ఉంటే, వాటి ప్రకారం స్లాట్లు అందుబాటులో ఉంటాయి. మరియు అవి ఆరోజు మధ్యాహ్నం 3:00 గం.లకు మూసివేయబడుతాయి. ఉదాహరణకు, మార్చి 1వ తేదీ కోసం మీరు బుక్ చేస్తే, దానిప్రకారం, మార్చి 1వ తేదీన ఆ బుకింగ్‌కు సంబంధించిన స్లాట్ అనేది ఉదయం 9:00 గం. నుండి మధ్యాహ్నం 3:00 వరకు తెరచి ఉంటుంది. అందుబాటును బట్టి, ఆ సమయానికి లోపల అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవచ్చు. అయితే, మార్చి 1 నుండి ఆ తర్వాతి ఏ తేదీ కోసమైనా అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాల కోసం, పౌర నమోదు మరియు అపాయింట్‌మెంట్ కోసం భారత ప్రభుత్వం రూపొందించిన యూజర్ గైడ్ పరిశీలించండి:
https://www.mohfw.gov.in/pdf/UserManualCitizenRegistration&AppointmentforVaccination.pdf

**కోవిడ్-19 వ్యాక్సిన్ దుష్ప్రభావాల గురించి నేను ఎక్కడ నివేదించాలి?**

కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న వారిలో మత్తుగా ఉండడం, జలుబు, మరియు బలహీనత లాంటి స్వల్ప దుష్ప్రభావాలు కనిపించడం మామూలే. అయితే, కొన్నిరోజుల్లోనే అవి నయమైపోతాయి. అయితే, దుష్ప్రభావాలు కొనసాగుతుంటే, తీవ్రంగా మారుతుంటే, మీ కేసును AEFI (ఇమ్యూనైజేషన్ తర్వాత తీవ్రమైన దుష్ప్రభావాలు)గా పరిగణిస్తారు.

తీవ్రమైన దుష్ప్రభావాలను నివేదించడం వల్ల, వ్యాక్సిన్‌కు సంబంధించిన అనిశ్చితుల మీద దృష్టి పెట్టేలా వ్యాక్సిన్ తయారీ కంపెనీలను ప్రోత్సహించవచ్చు. నిజమైన తీవ్రస్థాయి దుష్ప్రభావం నమోదైతే, ఆ వ్యాక్సిన్ వినియోగాన్ని అధికారులు నిలిపి వేస్తారు. అదేసమయంలో, ఈ దర్యాప్తులకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) కూడా మద్దతు ఇస్తుంది.

అలాగే, ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ వ్యాక్సిన్ వల్ల తలెత్తే తీవ్ర దుష్ప్రభావలను కూడా వారు పర్యవేక్షిస్తుంటారు. ఏదేమైనప్పటికీ, వ్యాక్సిన్ కారణంగా ప్రత్యక్షంగా తీవ్రస్థాయి ఆరోగ్య సమస్యలు తలెత్తిన దాఖలాలు మాత్రం లేదు.

**వ్యాధి నిరోధకత ప్రభావం తగ్గించడం కోసం ఔషధాలు వినియోగించే పేషెంట్లు వ్యాక్సిన్ తీసుకోవచ్చా?**

వ్యాక్సిన్‌లోని పదార్థాలకు అలర్జీ లేకపోతే మరియు ఏదైనా వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత ప్రతికూల పరిస్థితులు కనిపించిన దాఖలాలు లేకపోతే, ఆ పేషెంట్/గ్రహీత నిస్సందేహంగా కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవచ్చు.

నిజానికి, వ్యాధి నిరోధకత ప్రభావం తగ్గించే ఔషధాలు తీసుకుంటున్న వారికి వ్యాక్సినేషన్ ప్రక్రియలో కనీసం రెండు వారాల ముందస్తు ప్రాధాన్యత ఇవ్వాలని వైద్య నిపుణులు భావిస్తున్నారు. ఇలా చేయడం వల్ల, ఈ సమయంలో వారి వ్యాధినిరోధక వ్యవస్థ మెరుగవడంతో పాటు చాలావరకు అది అనుకూలంగా ప్రతిస్పందించే అవకాశం ఉంది.

వ్యాధినిరోధకత ప్రభావం తగ్గించే థెరఫీ, కీమోథెరఫీ, బయోలాజికల్ థెరఫీలు, ప్రోటీన్ కైనేస్ ఇన్‌హిబిటర్స్, లేదా నోటి ద్వారా ఔషధాలు తీసుకునే వారు కూడా కోవిడ్ -19 వ్యాక్సినేషన్‌లో భాగం కావాలి. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత కూడా, వీళ్లందరూ తమని తాము రక్షించుకోవడానికి భౌతిక దూరం లాంటి మార్గదర్శకాలను తప్పక పాటించాలి.

అలాగే, కోవిడ్-19 కోసం వ్యాక్సిన్ తీసుకున్నవారు మరియు వ్యాధినిరోధకత ప్రభావం తగ్గించడం కోసం థెరఫీలు తీసుకుంటున్నవారు మళ్లీ వ్యాక్సిన్ తీసుకోవాల్సిన అవసరం లేదని గుర్తుంచుకోండి. అయితే, వ్యాధినిరోధకత ప్రభావం తగ్గించే ఔషధాలు తీసుకుంటున్న పేషెంట్లు ఒక మెరుగైన ఆలోచన కోసం, వ్యాక్సిన్ తీసుకునే ముందు వారి వైద్యుడిని సంప్రదించాలని సిఫార్సు చేయడమైనది.

**కోవిడ్-19 కోసం ప్లాస్మా చికిత్స తీసుకున్న వారు కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవచ్చా?**

**తీసుకోవచ్చు!** ప్లాస్మా చికిత్స చేయించుకున్న వారికి కూడా వ్యాక్సిన్ వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. అయితే, ఇక్కడ తప్పక గుర్తించుకోవాల్సిన విషయం ఒకటి ఉంది. ప్లాస్మా థెరఫీకి మరియు వ్యాక్సిన్ తీసుకోవడానికి మధ్య ఖచ్చితంగా 90 రోజుల వ్యవధి ఉండాలి. కరోనా వైరస్ అనేది ఎంత తీవ్రమైన ఇన్ఫెక్షనో, అది మన శ్వాసకోశ వ్యవస్థకు ఏమేరకు ప్రమాదంగా మారగలదో మనకు తెలుసు.

కోవిడ్-19 చికిత్సలో భాగంగా కొనసాగించిన మోనోక్లోనల్ లేదా కన్వాలేసెంట్ ప్లాస్మా నుండి ఉత్పన్నమయ్యే ప్రతిరోధకాల ఆధారంగా, ప్లాస్మా చికిత్స తీసుకున్న వ్యక్తి కూడా కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవడం సురక్షితమేనని గుర్తించారు. ఒకసారి కరోనా పాజిటివ్ అని తేలిన తర్వాత, 90 రోజుల లోపల మళ్లీ కరోనావైరస్ సంక్రమణ అనేది అత్యంత అరుదు అని సాక్ష్యాధారాలు మరియు ట్రయల్స్ తెలియజేస్తున్నాయి. ఈ కారణంగానే, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సిన్ తీసుకోవాలనుకునేవారు 90 రోజుల విరామం తీసుకోవడం చాలా ముఖ్యం.

**సార్స్-CoV-2 చరిత్ర కలిగిన వ్యక్తులకు కూడా కోవిడ్-19 వ్యాక్సిన్ ఇవ్వొచ్చా?**

ఇవ్వొచ్చు. వ్యాక్సినేషన్ అనేది అందరికీ ముఖ్యమే. గతంలో సార్స్-CoV-2 (సివియర్ అక్యూట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ కరోనావైరస్ 2) లేదా కోవిడ్-19 వ్యాధి సోకినవారు - లక్షణాలు కనిపించినవారు లేదా కనిపించనివారు - కూడా తప్పక వ్యాక్సిన్ తీసుకోవాలి. కోవిడ్-19 వ్యాధికి వ్యతిరేకంగా మీలో బలమైన వ్యాధినిరోధకత అభివృద్ధి చెందడంలో వ్యాక్సినేషన్ సహాయపడుతుంది.

అయితే, కోవిడ్-19 ధృవీకరించబడిన వారు వ్యాక్సినేషన్ కేంద్రానికి రావడం వల్ల ఇతరులకు వ్యాధిని సంక్రమింపజేసే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, భారత ప్రభుత్వపు మార్గదర్శకాల ప్రకారం, ఇన్ఫెక్షన్‌కు గురైన వ్యక్తులు వారిలో లక్షణాలు పూర్తిగా తగ్గేవరకు 2 వారాలు (14 రోజులు) వరకు వ్యాక్సిన్ తీసుకోవడాన్ని వాయిదా వేయాలి. WHO సూచించిన క్వారంటైన్ మార్గదర్శకాల ప్రకారం, లక్షణాలు తగ్గిన 4 వారాలు (28 రోజులు) వరకు వ్యాక్సిన్ తీసుకునే కార్యక్రమం వాయిదా వేయాలి. ప్రపంచవ్యాప్త వైద్య నిపుణులు చేసిన ఈ సిఫార్సులనేవి అన్ని రకాల కోవిడ్-19 వ్యాక్సిన్లకు వర్తిస్తాయి.

## కోవిడ్ వ్యాక్సిన్‌తో లక్షణాలు లేని వారి వల్ల కోవిడ్ వ్యాపించడం పరిమితమవుతుందా?

కోవిడ్-19ను నిరోధించే వ్యాక్సిన్లను ప్రపంచవ్యాప్త దేశాలు తయారుచేస్తున్న కారణంగా, కోవిడ్-19 వ్యాధికి కారణమయ్యే సార్స్-CoV-2 వైరస్‌ని వ్యాప్తిని కోవిడ్ వ్యాక్సిన్లు సమర్థవంతంగా ఆపగలవా అని నిర్ధారించడం కోసం పలు అధ్యయనాలు సాగుతున్నాయి. సంక్రమణను నిరోధించే వ్యాక్సిన్లను వీలైనంత ఎక్కువ మందికి ఇవ్వడం వల్ల ఈ మహమ్మారిని నియంత్రణలోకి తీసుకురావడం వీలవుతుంది.

ప్రాథమిక అధ్యయనాలు సూచిస్తున్న ప్రకారం, కరోనావైరస్ సంక్రమణను తగ్గించడంలో కోవిడ్-19 వ్యాక్సిన్లు విజయవంతంగా పనిచేస్తున్నాయి. చాలా అధ్యయనాలు పేర్కొంటున్న ప్రకారం, వ్యాక్సిన్ తీసుకుంటున్న వ్యక్తుల్లో వైరల్ లోడ్ తక్కువగా ఉండడం వల్ల, వారి ద్వారా సంక్రమణ కూడా తక్కువగా ఉంటోంది.

అనేక క్లినికల్ ట్రయల్స్ ప్రకారం, వ్యాధి వ్యాప్తిని నిరోధించడంలో వ్యాక్సిన్లు విజయవంతమయ్యాయి. అయితే, లక్షణాలు కలిగిన లేదా లక్షణాలు లేని వారి ద్వారా వ్యాధి వ్యాపించే అవకాశాన్ని పరిమితం చేయడంలో వ్యాక్సిన్లు సమర్థంగా పనిచేస్తాయని ఇప్పుడే చెప్పడం తొందరపాటు అవుతుంది. నిపుణుల ప్రకారం, వ్యాక్సిన్లు తీసుకోవడం వల్ల వ్యక్తులు కోవిడ్-19 బారిన పడడం తగ్గుతుంది. తద్వారా, వ్యాప్తి కూడా క్రమేపీ తగ్గుతుంది.

## మెదడు క్యాన్సర్ పేషెంట్లను కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?

వ్యాక్సిన్లు అభివృద్ధి చేసిన పరిశోధకులు మెదడు క్యాన్సర్ బాధితుల విషయాన్ని ప్రత్యేకంగా పరిగణించలేదు. క్యాన్సర్‌తో జీవిస్తున్న వారందరికీ మరియు క్రియాశీల చికిత్స పొందుతున్న క్యాన్సర్ రోగులందరికీ టీకాలు వేయాలని సిఫార్సు చేయడమైనది. కాబట్టి, వ్యాక్సిన్ తీసుకునే అర్హత కలిగిన క్యాన్సర్ పేషెంట్లు అందరికీ తప్పనిసరిగా కోవిడ్-19 వ్యాక్సిన్ ఇవ్వాలి.

క్యాన్సర్ చికిత్స కారణంగా, మీ వ్యాధినిరోధక శక్తి ప్రభావితంలో ఉంటే, మీ చికిత్సా వైద్యుడితో మాట్లాడండి, కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవడానికి మీకు ఉత్తమమైన సమయం గురించి వారు మీకు సలహా ఇస్తారు. ఎందుకంటే, మీ చికిత్సా సమయంలో ఎప్పుడు మీకు వ్యాక్సిన్ ప్రభావితంగా ఉంటుందో వారు చెప్పగలరు.

**రొమ్ము క్యాన్సర్ పేషెంట్లు కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవచ్చా?**

నిపుణులు సిఫార్సు చేస్తున్న ప్రకారం, క్యాన్సర్ పేషెంట్ల (రొమ్ము క్యాన్సర్ పేషెంట్లు కూడా)కు కోవిడ్-19 సోకితే, వారు తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది కాబట్టి, క్యాన్సర్‌తో జీవిస్తున్నవారు మరియు రొమ్ము క్యాన్సర్ పేషెంట్లతో సహా ఇతర క్యాన్సర్ పేషెంట్లు అందరికీ కోవిడ్ వ్యాక్సిన్ వేయాలి.

రొమ్ము క్యాన్సర్‌కు అందించే చికిత్సలు సాధారణంగా మీ వ్యాధినిరోధక వ్యవస్థను బలహీనం చేస్తాయి కాబట్టి, మీకు సులభంగా ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంటుంది. అలాంటి పరిస్థితిలో, మీకు సార్స్-CoV-2 వైరస్ ఇన్ఫెక్షన్ సోకితే తీవ్రమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

అయితే, రొమ్ము క్యాన్సర్ కోసం మీరు ప్రస్తుతం ఏదైనా థెరపీలో ఉంటే, వ్యాక్సిన్ గురించి మీ డాక్టరుతో మాట్లాడండి. రేడియోథెరపీ మరియు కీమోథెరపీ చేయించుకుంటున్నవారు తప్పనిసరిగా వారి డాక్టర్‌తో మాట్లాడడం ద్వారా, ఎప్పుడు వ్యాక్సిన్ తీసుకోవాలో నిర్ణయించుకోవాలి.

**గుండె జబ్బు పేషెంట్లు కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవచ్చా?**

**తీసుకోవచ్చు.** గుండె జబ్బులు మరియు స్ట్రోక్ నిపుణులు సిఫార్సు చేస్తున్న ప్రకారం, గుండె జబ్బులున్న పేషెంట్లు కోవిడ్-19 వ్యాక్సిన్లు తీసుకోవాలి. ఎందుకంటే, రక్తపోటు లేదా గుండెపోటు వంటి కొన్ని అంతర్లీన ఆరోగ్య సమస్యలున్న ఏ వయసు వారైనా కోవిడ్-19కి కారణమయ్యే సార్స్-CoV-2 వైరస్ కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. అలాగే, మీరు వయోవృద్ధులైతే, గుండె వైఫల్యం లాంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య ఉంటే, కోవిడ్-19 వ్యాధి మీకు ప్రాణాంతకం కావచ్చు.

కోవిడ్-19 వ్యాక్సిన్లను పెద్ద సంఖ్యలో వ్యక్తుల మీద పరీక్షించారు. ఇవి సురక్షితమైనవి మరియు ప్రభావవంతమైనవి. క్లినికల్ ట్రయల్స్ సందర్భంగా, కోవిడ్-19 వ్యాక్సిన్లు అంతర్లీన సమస్యలు ఉన్న ఆరోగ్యవంతుల్లో చక్కగా పనిచేశాయి. కోవిడ్-19కి సంబంధించి నొప్పి, ఇంజెక్షన్ వేసిన ప్రదేశంలో వాపుతో సహా జ్వరం, ముక్కు కారడం, మరియు దగ్గు లాంటి ఫ్లూ తరహా లక్షణాలు అత్యంత సాధారణంగా దుష్ప్రభావాలుగా ఉన్నాయి. ఈ లక్షణాలన్నీ సాధారణంగా కొన్ని రోజుల్లోనే తగ్గిపోతాయి. గుండె జబ్బుల పేషెంట్‌లలో సైతం ఈ దుష్ప్రభావాలనేవి ఇతరుల్లో ఉన్నట్టుగానే ఉంటాయి. అయితే, మీ పరిస్థితికి సంబంధించి మరియు వ్యాక్సిన్ గురించి మీకు ఏవైనా నిర్దిష్ట ప్రశ్నలు ఉంటే మీ డాక్టర్‌ని అడగండి.

**మలేరియా పేషెంట్లను కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?**

ప్రతిఒక్కరూ వ్యాక్సిన్ తీసుకోవాలి. అయితే, మలేరియా కోసం చికిత్స తీసుకుంటున్న అతను/ఆమె మలేరియా నుండి పూర్తిగా కోలుకునే వరకు వ్యాక్సిన్ తీసుకోకూడదు. అలాగే, మలేరియా నుండి కోలుకున్న తర్వాత కూడా, వ్యాక్సిన్ వల్ల తమకు ఎలాంటి వ్యతిరేక పరిస్థితులు ఏర్పడవని పేషెంట్లు నిర్ధారించుకోవాలి.

అంతేకాకుండా, మలేరియా చికిత్స కోసం మీరు హైడ్రాక్సిక్లోరోక్విన్ మరియు క్లోరోక్విన్ లాంటి ఔషధాలు తీసుకుంటూ ఉంటే, కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకునే ముందు ఆ విషయమై మీ వైద్యుడితో మాట్లాడండి. కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు మీ గత వైద్య చరిత్ర, అలర్జీలు, మరియు మీరు తీసుకుంటున్న ఔషధ వివరాలను మీ డాక్టరుకి పూర్తిగా తెలియజేయండి.

**పిత్తాశయంలో రాళ్లు ఉన్న పేషెంట్లను కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?**

కోవిడ్-19 కొన్నిసార్లు శ్వాససంబంధితంగా కాకుండా, జీర్ణాశయ సంబంధిత లక్షణాలతో కనిపించవచ్చు. చికిత్సా సమయం ఆలస్యమయ్యే కొద్దీ, పరిస్థితి పూర్తి అధ్వాన్నంగా మారవచ్చు.

కొన్ని అరుదైన సందర్భాల్లో, తీవ్రమైన పొత్తికడుపు నొప్పి రూపంలో కూడా కోవిడ్-19 అత్యవసర వైద్య పరిస్థితిని సూచించవచ్చు. కోవిడ్-19 వైరస్‌లు పేషెంట్ల పిత్తాశయంలో కూడా కనిపించడమనేది ఆశ్చర్యమేమీ కాదు. అలాగే, పిత్తాశయంలో ఎలాంటి సమస్యలు లేకుండానే ఈ వైరస్‌లు అందులో కనిపించవచ్చు. ఈ అవయవంలోని ప్రత్యేకమైన కణాలు సైతం అత్యధిక స్థాయిలో ACE2 గ్రాహకాలు కలిగి ఉంటాయి. పిత్తాశయానికి నష్టం ఏర్పడితే (క్లోమానికి జరిగినట్టే) జీర్ణాశయ సంబంధిత లక్షణాలు కనిపించవచ్చు. కోవిడ్-19 వైరస్‌లు మన శరీరంలోని కణాల్లో కనిపించే ACE2 గ్రాహకాల ద్వారా మన కణాలను వాటి ఆధీనంలోకి తీసుకుంటాయి.

కోవిడ్-19 వైరస్ ద్వారా ఏర్పడే ఇన్ఫెక్షన్ అనేది అపరిచిత యంత్రాంగం ద్వారా పిత్తాశయ వాపు ఏర్పడడానికి కారణమవుతున్నట్టు అనేక కేసుల్లో నివేదించబడింది. పిత్తాశయ సంబంధిత సమస్య ఉన్నవారికి వ్యాక్సిన్ కంటే వైరస్ కారణంగానే ఎక్కువ ప్రమాదం ఉంటుంది. కాబట్టి, పిత్తాశయంలో రాళ్లు ఉన్న పేషెంట్లకు కోవిడ్-19 వ్యాక్సిన్ ఇవ్వడం సురక్షితం.

స్థూలకాయం పేషెంట్లను కోవిడ్-**19** వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?

కోవిడ్-19 వ్యాక్సిన్ పనితీరు అనేది చాలావరకు ఆరోగ్యవంతమైన వ్యాధినిరోధక వ్యవస్థ మీద ఆధారపడి ఉంటుంది. గతంలో చేసిన శాస్త్ర పరిశోధనల ప్రకారం, స్థూలకాయం అనేది శరీరంలోని వ్యాధి నిరోధకత వ్యవస్థ పనితీరు మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది. అయితే, అమెరికాకు చెందిన FDA డేటా ప్రకారం, ప్రత్యేకించి స్థూలకాయంతో ఉన్న పేషెంట్లు వ్యాక్సిన్ తీసుకోవడం పూర్తి ప్రయోజనకరంగా ఉంటంది.

అధిక బరువు లేదా స్థూలకాయం కలిగిన వ్యక్తులు రెండు విషయాలు అనుసరించాలి. అవి: వ్యాయామం మరియు మెరుగైన ఆహార అలవాట్లు. గత అధ్యయనాల ప్రకారం, వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల మీ వ్యాధినిరోధక వ్యవస్థ ప్రతిస్పందన అనుకూలంగా ఉంటుంది. దీనివల్ల, బ్యాక్టీరియా లేదా వైరస్‌కు ప్రభావితమైనప్పుడు నాలుగు రెట్లు ఎక్కువ ప్రతిరక్షకాలు ఉత్పత్తి అవుతాయి. అంటే, వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు వ్యాయామం చేయని వారితో పోల్చితే, వ్యాయామం చేసిన వారిలో ప్రతిరక్షకాలు అధిక సంఖ్యలో ఉంటాయి.

అలాగే, మీ జీర్ణాశయంలోని బ్యాక్టీరియా రకం మరియు పరిమాణం కూడా వ్యాక్సిన్ ప్రతిస్పందనను ప్రభావితం చేస్తుంది. కాబట్టి, స్థూలకాయంతో ఉన్నవారు కోవిడ్-19 నుండి రక్షణ కోసం తప్పక వ్యాక్సిన్ తీసుకోవాలి.

**చర్మ అలర్జీలు ఉన్న పేషెంట్లను కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?**

వ్యాక్సిన్ వల్ల అలర్జీలు వచ్చిన సందర్భాలు ఇప్పటివరకు చాలా తక్కువ. కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందే చర్మ అలర్జీలకు కారణమవుతున్న అంశాల గురించి స్పష్టంగా తెలుసుకోవాలి. ఎవరికైనా చర్మ అలర్జీ ఉంటే, అలాంటివారు డాక్టర్‌ని సంప్రదించడం ద్వారా, కోవిడ్-19లోని ఏ పదార్థాల వల్ల చర్మ అలర్జీలు కలిగే అవకాశం ఉందో తెలుసుకోవాలి. వ్యాక్సిన్‌లోని పదార్థాల గురించిన వివరణాత్మక జాబితా ఆన్‌లైన్‌లో ఉంది లేదా వైద్యుడి ద్వారా తెలుసుకోవచ్చు. దురద, ర్యాషెస్, వాపు, మొదలైన చర్మ అలర్జీల చరిత్ర ఉన్న వ్యక్తులు ఇమ్యునాలజీ నిపుణులను సంప్రదించాలని సిఫార్సు చేయడమైనది. చర్మ అలర్జీలు కలిగినవారు డాక్టర్ ఆమోదం తర్వాత వ్యాక్సిన్ తీసుకోవచ్చు. చర్మ అలర్జీలు లేదా తేలికపాటి అలర్జీల చరిత్ర ఉన్న వ్యక్తులందరూ డాక్టర్ సిఫార్సు మేరకు వ్యాక్సిన్ తీసుకోవాలి. లేకపోతే, మంచి కంటే చెడు ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. అలాగే, దుష్ప్రభావాలు కూడా కలగొచ్చు. చర్మ అలర్జీలు కలిగిన పేషెంట్లు 30 నిమిషాలు పరిశీలనలో ఉండడం ద్వారా తిరగబెట్టే దుష్ప్రభావాలు లేవని నిర్ధారించుకోవాలి. కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత, ఏదైనా ర్యాష్ లాంటిది కనిపిస్తే, మీ డాక్టర్‌ని సంప్రదించండి.

**హెపటైటిస్ బి పేషెంట్లను కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?**

హెపటైటిస్-బితో బాధపడే వ్యక్తుల్లో రోగనిరోధక శక్తి తగ్గిపోయే పరిస్థితి ఉండదు. కాబట్టి, హెపటైటిస్-బి లేని వ్యక్తులు లాగే వీళ్లు కూడా కోవిడ్-19 వ్యాక్సిన్‌కు ప్రతిస్పందిస్తారు. హెపటైటిస్-బి ఉన్నవారిలో వ్యాక్సిన్ అనేది దుష్ప్రభావాలకు కారణమవుతున్నట్టు ఇప్పటివరకు గుర్తించలేదు. హెపటైటిస్-బి క్రియాశీలంగా లేదా నిష్క్రియా స్థితిలో ఉన్నవారు డాక్టర్‌ని సంప్రదించిన తర్వాత వ్యాక్సిన్ తీసుకోవచ్చు. ఇలాంటివారు వ్యాక్సిన్ తీసుకోకుండా ఉండాలని చెప్పడానికి ఇప్పటివరకు ఎలాంటి శాస్త్రీయ కారణం కనుగొనలేదు. అధ్యయనాల్లో కనుగొన్న ప్రకారం, హెపటైటిస్-బి వ్యక్తుల్లో సంక్రమణ తీవ్రత తక్కువగానే ఉంది. కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రక్రియ అనేది కాలేయం దెబ్బతినడంతో ముడిపడి ఉందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. కాబట్టి, హెపటైటిస్-బి మరియు కాలేయం దెబ్బతినడం రెండూ ప్రమాదకరం

కాబట్టి, ఈ పేషెంట్లు ముందుగా వైద్యులను సంప్రదించాలి. హెపటైటిస్-బి మాత్రమే ఉన్నవారిని వ్యాక్సిన్ తీసుకోవాల్సిన అధిక ప్రాధాన్యతా జాబితాలో ఇంకా చేర్చలేదు. ఊపిరితిత్తుల వ్యాధుల పేషెంట్లతో పోల్చితే, వీరిలో కరోనా వల్ల దుష్ప్రభావాలు తక్కువగా ఉండడమే ఇందుకు కారణం. అయితే, హెపటైటిస్-బితో బాధపడేవారు వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు డాక్టర్‌ని సంప్రదించాలి.

**క్లోమం మార్పిడి చేయించుకున్న పేషెంట్లను కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?**

అధ్యయనాలు పేర్కొంటున్న ప్రకారం, క్లోమం మార్పిడి చేయించుకున్న వారిలో కోవిడ్-19 వ్యాక్సిన్ వల్ల చెప్పుకోదగ్గ ప్రమాదాలేవీ ఎదురుకాలేదు.

క్లోమం మార్పిడి చేయించుకోబోతున్న పేషెంట్లకు ఇది అధిక ప్రమాదం కావచ్చు. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల వారిలో వ్యాధినిరోధక శక్తి ప్రభావాన్ని అణచిపెట్టాల్సి రావడం మరియు సంక్లిష్ట వ్యాధులు (రెండు లేదా ఎక్కువ వ్యాధులు ఒకేసారి రావడం) లాంటి సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి, మీలో వ్యాధినిరోధక శక్తి ప్రభావాన్ని ఏమేరకు అణచి ఉంచారనే దానిమీద ఆధారపడి మీరు వ్యాక్సిన్ తీసుకునే విషయమై మీ వైద్యుడిని సంప్రదించండి.

కాలేయం మార్పిడి జరిగిన వారి మీద కోవిడ్-**19** వ్యాక్సిన్ ప్రభావం చూపుతుందా?

అధ్యయనాలు పేర్కొంటున్న ప్రకారం, కాలేయం మార్పిడి చేయించుకున్న వారిలో కోవిడ్-19 వ్యాక్సిన్ వల్ల చెప్పుకోదగ్గ ప్రమాదాలేవీ ఎదురుకాలేదు.

కాలేయం మార్పిడి చేయించుకోని వారితో పోల్చితే, మార్పిడి చేయించుకున్న వారిలో కోవి-19 వ్యాక్సిన్ తక్కువ ప్రభావవంతంగా ఉండవచ్చు మరియు తక్కువ ప్రతిరక్షకాలు మాత్రమే ఉత్పత్తి చేయవచ్చు. ఎలాంటి అవయవ మార్పిడి చేయించుకున్నవారైనా, వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు వారికి చికిత్స అందిస్తున్న వైద్యుడిని సంప్రదించడం తప్పనిసరి. మీలో వ్యాధినిరోధక శక్తి ప్రభావాన్ని ఏమేరకు అణచి ఉంచారనే దానిమీద ఆధారపడి మీరు వ్యాక్సిన్ తీసుకునే విషయమై మీ వైద్యుడితో చర్చించండి.

శస్త్రచికిత్స చేయించుకుంటున్న పేషెంట్లను కోవిడ్-**19** వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?

శస్త్రచికిత్స చేయించుకుంటున్న, చేయించుకోబోయే లేదా చేయించుకున్న వారు వైద్యుడిని తప్పక సంప్రదించాలి. శస్త్రచికిత్స మరియు వ్యాక్సిన్ తీసుకోవడం మధ్య వ్యవధి గురించి చర్చించాలి.

అవయవ మార్పిడి చేయించుకుంటున్న పేషెంట్లను కోవిడ్-**19** వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?

అవయవ మార్పిడికి సిద్ధమైన వారికి మిగిలిన అందరి కంటే ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వీరిలో తక్కువ వ్యాధినిరోధకత మరియు తక్కువ సంఖ్యలో ప్రతిరక్షకాలు ఉండడమే ఇందుకు కారణం. కోవిడ్-19 సహా ఇతర వ్యాధులను నిరోధించడానికి వీరు తమ పరిసరాల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి.

సాధారణంగా, పేషెంట్‌లోని వ్యాధినిరోధకత స్థాయి ఆధారంగా కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం సురక్షితమే అయినప్పటికీ, అవయవ మార్పిడి సిద్ధమైనవారు వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు వారి వైద్యుడిని సంప్రదించాలి. ఎందుకంటే, భారతదేశంలో ఆమోదం పొందిన రెండు కోవిడ్ వ్యాక్సిన్లు - కోవీషీల్డ్ మరియు కోవాగ్జిన్ - ప్రస్తుతం అత్యవసర వినియోగం కోసమే ఉపయోగిస్తున్నారు. కోవాగ్జిన్ అనేది మొత్తం వైరస్‌ను క్రియారహితం చేయడం ద్వారా తయారైనది, కోవీషీల్డ్ అనేది జలుబు వైరస్‌ను బలహీనం చేయడం ద్వారా తయారైనది.

కాబట్టి, అవయవ మార్పిడి చేయించుకున్న వారిలో వ్యాధినిరోధకత శక్తిని అణచిపెట్టి ఉంటారు కాబట్టి, వారు క్రియాశీల వైరస్‌తో తయారైన కోవాగ్జిన్ తీసుకోవాలి. వీళ్లు కోవీషీల్డ్ తీసుకుంటే, వీరిలో కరోనావైరస్ ఇన్ఫెక్షన్ ఎక్కువ కావచ్చు, దానివల్ల తీవ్ర పరిణామాలు కలగవచ్చు.

మోకాలు మార్పిడి చేయించుకుంటున్న పేషెంట్లను కోవిడ్-**19** వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?

**అవును**. మోకాలు మార్పిడి చేయించుకున్న పేషెంట్లు కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవాలి. సాధారణంగా, పేషెంట్‌లోని వ్యాధినిరోధకత స్థాయి ఆధారంగా కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం సురక్షితమే అయినప్పటికీ, మోకాలు మార్పిడికి సిద్ధమైనప్పుడు, శస్త్రచికిత్స సమయాన్ని బట్టి అతను/ఆమె వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు వైద్యుడిని సంప్రదించాలి.

మూత్రపిండం మార్పిడి చేయించుకుంటున్న పేషెంట్లను కోవిడ్-**19** వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?

**అవును.** మూత్రపిండం మార్పిడి చేయించుకున్న పేషెంట్లు కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవాలి. సాధారణంగా, పేషెంట్‌లోని వ్యాధినిరోధకత స్థాయి ఆధారంగా కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం సురక్షితమే అయినప్పటికీ, మూత్రపిండం మార్పిడికి సిద్ధమైనప్పుడు, శస్త్రచికిత్స సమయాన్ని బట్టి అతను/ఆమె వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు వైద్యుడిని సంప్రదించాలి.

కీమోథెరపీ చేయించుకుంటున్న పేషెంట్లను కోవిడ్-**19** వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?

కీమోథెరపీ లాంటి క్యాన్సర్ చికిత్సల వల్ల వ్యాధి నిరోధకత వ్యవస్థ ప్రభావితమవుతుంది. దీనివల్ల వ్యాక్సిన్ ప్రభావం తగ్గిపోవచ్చు. క్యాన్సర్ నిపుణులు ప్రస్తుతం సిఫార్సు చేస్తున్న ప్రకారం, క్యాన్సర్ ఉన్నవారు లేదా క్యాన్సర్ చరిత్ర

ఉన్నవారు తప్పక కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవాలి. అయితే, వ్యాక్సిన్ తీసుకోబోయే సమయం మీద ఆధారపడి, వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు మీ క్యాన్సర్ డాక్టర్‌తో చర్చించాలని సూచన.

**ఆంకాలజీ చికిత్సలో ఉన్న పేషెంట్లను కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?**

కీమోథెరఫీ, రేడియేషన్ థెరఫీ, ఇమ్యూనోథెరఫీ లాంటి కొన్ని క్యాన్సర్ చికిత్సలు క్యాన్సర్ పేషెంట్లలో వ్యాధినిరోధక వ్యవస్థ మీద ప్రభావం చూపుతాయి. దీనివల్ల వ్యాక్సిన్ ప్రభావం తగ్గిపోయే అవకాశం ఉంది.

క్యాన్సర్ పేషెంట్లలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది కాబట్టి, వారికి ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఎక్కువ. అందుకే, క్యాన్సర్ ఉన్నవారు లేదా క్యాన్సర్ చరిత్ర కలిగినవారు కూడా కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవాలని ఆంకాలజిస్టులు ఇప్పుడు సిఫార్సు చేస్తున్నారు. అయితే, వ్యాక్సిన్ తీసుకోబోయే సమయం మీద ఆధారపడి, వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు మీ క్యాన్సర్ డాక్టర్‌తో చర్చించాలని సూచన.

**మధుమేహం పేషెంట్లను కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?**

మధుమేహం నియంత్రణలోనే ఉన్నప్పటికీ, ఇన్ఫెక్షన్లను ఎదుర్కోవడంలో మీ వ్యాధినిరోధక శక్తి పరిస్థితి క్లిష్టంగానే ఉంటుంది. కాబట్టి, మధుమేహం లేనివారితో పోలిస్తే, మధుమేహం ఉన్నవారిలో అత్యంత తీవ్ర సమస్యల తలెత్తే పరిస్థితి ఎక్కువగా ఉంటుంది.

వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల, వ్యాక్సిన్ ద్వారా నిరోధించగల ఇన్ఫెక్షన్ల నుండి అత్యుత్తమ రక్షణ లభిస్తుంది. కాబట్టి, టైప్ 2 మధుమేహంతో బాధపడే వారికి కోవిడ్-19తో సహా ఇతర ఇన్ఫెక్షన్ల ప్రమాదం ఎక్కువగా ఉండడం వల్ల వారు తప్పక కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవాలి. అయితే, ఇన్ఫెక్షన్లు నియంత్రించడానికి మీ గ్లూకోజ్ స్థాయిలు అదుపులో ఉండాలనే విషయం మర్చిపోకండి.

వ్యాక్సిన్లు అధిక ప్రభావవంతమైనవి, భరించే శక్తి కలిగినవి మరియు డయాబెటిస్ వంటి అంతర్లీన ప్రతికూల పరిస్థితులు ఉన్నవారిలో మంచి వ్యాధినిరోధకత ప్రతిస్పందన చూపుతాయి. వ్యాక్సిన్ వల్ల కలిగే దుష్ప్రభావాలు తేలికైనవి, త్వరలోనే వాటంతట అవే తగ్గిపోతాయి. తీవ్రమైన దుష్ప్రభావాలు చాలా అరుదు.

**కాలేయ క్యాన్సర్ పేషెంట్లను కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావితం చేస్తుందా?**

హెపటైటిస్-బి లేదా హెపటైటిస్ సి లాంటి దీర్ఘకాలిక కాలేయ వ్యాధులున్న వారిలో సాధారణంగా కాలేయ క్యాన్సర్ సంభవిస్తుంది. ఇలాంటి వారిలో కోవిడ్-19 ఇన్ఫెక్షన్ తీవ్రమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

క్యాన్సర్ పేషెంట్లలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది కాబట్టి, వారికి ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఎక్కువ. అందుకే, క్యాన్సర్ పేషెంట్లు లేదా క్యాన్సర్ చరిత్ర కలిగినవారు కూడా కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవాలని ఆంకాలజిస్టులు ఇప్పుడు సిఫార్సు చేస్తున్నారు. అయితే, వ్యాక్సిన్ తీసుకోబోయే సమయం మీద ఆధారపడి, వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు మీ క్యాన్సర్ డాక్టర్‌తో చర్చించాలని సూచన.

వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత మద్యం సేవించడం ఎందుకు మానేయాలి?

వ్యాక్సిన్ తీసుకున్న వారు 45 రోజుల వరకు మద్యం సేవించకూడదని సలహా ఇవ్వడమైనది. మద్యం సేవించడం వల్ల వ్యాక్సిన్ వ్యాధినిరోధక ప్రభావం మీద ప్రతికూల ప్రభావం పడవచ్చు. మద్యం సేవించడం వల్ల కాలేయం పనితీరు మందగిస్తుంది. తద్వారా, శరీరపు వ్యాధినిరోధక వ్యవస్థ బలహీనమవుతుంది.

మద్యం సేవించడం వల్ల వ్యాక్సిన్ ప్రభావం ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. కొద్ది మోతాదులో మద్యం సేవించడం అనుమతించదగ్గ విషయమే. దీనివల్ల వ్యాక్సిన్ ప్రభావం మీద ప్రతికూలత ఉండదు. కానీ, అధిక మోతాదులో మాత్రం తాగకూడదు. దానివల్ల మంచి కంటే చెడే ఎక్కువ జరుగుతుంది.

వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు రోజు నుండి మొదలుపెట్టి, వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత రెండు వారాలు, లేదా 45 రోజుల వరకు మద్యం తాగకుండా ఉండడం మంచిది. మద్యం సేవించడం వల్ల వ్యాధి నిరోధకత ప్రతిస్పందన ప్రక్రియ మందగించే ప్రమాదం ఉంది.

వేరియెంట్ కోవిడ్-19 స్ట్రెయిన్ అనేది వ్యాక్సిన్ దుష్ప్రభావం వల్ల ఏర్పడిందా?

**కాదు.** బలమైన ఉత్పరివర్తనం వల్ల ఏర్పడిన బహుళ వేరియెంట్లు మరియు సార్స్-CoV-19 స్ట్రెయిన్లు అనేవి వ్యాక్సిన్ దుష్ప్రభావాల వల్ల ఏర్పడినవి కావు. అందుబాటులోని మరియు నావల్ కరోనా వైరస్ చికిత్స కోసం ఆమోదం పొందిన వ్యాక్సిన్లలో ఏది కూడా సార్స్-CoVలో జరిగిన ఉత్పరివర్తనానికి కారణం కాదు. "స్ట్రెయిన్" అనే పదానికి అనేక తప్పు అర్థాలు ఉండడమే ఇందుకు కారణం.

స్ట్రెయిన్ అంటే వేరియెంట్ అనే అర్థం. ఒక వైరస్‌లో జరిగే ఉత్పరివర్తనం కారణంగా, అదే లక్షణాలతో కొత్త స్ట్రెయిన్లు ఏర్పడుతాయి. కోవిడ్-19 స్ట్రెయిన్ ఏసమయంలోనూ వేరియెంట్లను సృష్టించదు. వైరస్ ఉత్పరివర్తనం చెందడం వల్ల అది బహుళ వేరియెంట్లుగా మారుతుంది. అయితే, దానికి వ్యాక్సిన్ కారణం కాదు. దానికి కారణం వైరస్ మాత్రమే. వైరస్ పెద్ద సంఖ్యలో వ్యాప్తి చెందినప్పుడు, అది ఉత్పరివర్తనం చెందడం ద్వారా ప్రతి జీవిత చక్రంలోనూ మరింత శక్తివంతమైన స్ట్రెయిన్‌కి జన్మనిస్తుంది.

**కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావం ఎంతకాలం ఉంటుంది?**

నిజంగానే ఈ ప్రశ్నకి ఇప్పుడు సమాధానం లేదు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం, కోవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావం కొన్ని నెలల వరకు లేదా అంతకంటే ఎక్కువకాలం ఉండవచ్చు. వ్యాధికి నిరోధకత సాధించడమనేది కోవిడ్ వ్యాక్సిన్ రెండో డోసు తీసుకున్న రెండు వారాల లోపల మొదలవుతుంది. ఈ డోసుల వల్ల మీలో వ్యాధినిరోధకత ప్రతిస్పందన మొదలవుతుంది, కొత్త ప్రతిరక్షకాలు తయారవుతాయి మరియు రక్షణ లభిస్తుంది.

అయితే, వ్యాక్సిన్ ప్రభావం అనేది వ్యాధినిరోధకత శక్తి, అంతర్గత వ్యాధి లేదా అలర్జీలు లాంటి వివిధ బాహ్య మరియు అంతర కారకాల మీద ఆధారపడి ఉంటుంది కాబట్టి, వ్యాక్సిన్ ప్రభావం అనేది వ్యక్తి నుండి వ్యక్తికి వేరుగా ఉంటుంది.

**పాలిచ్చే తల్లి కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకోవడం సురక్షితమేనా?**

పాలిచ్చే తల్లిని 'అధిక-ప్రమాద' వైద్య పరిస్థితిలో ఉన్న వారి జాబితాలో చేర్చలేదు. ఎందుకంటే, వీరిలో కోవిడ్-19 ప్రభావాలు లేదా భద్రత గురించి ప్రస్తుతం ఎలాంటి సమాచారం లేదు. వ్యాక్సిన్ తీసుకోవడానికి సిద్ధమవ్వండి. అదేసమయంలో, వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందు మీ వైద్యుడితో మాట్లాడండి.